క్లుప్తంగా

హైదరాబాద్ దిగ్బంధానికి సన్నాహక పాదయాత్ర



మాదిగల సన్నాహక పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

తలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వచ్చే నెల 4న హైదరాబాద్ దిగ్బంధానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కిరణ్‌పూలే ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో మాదిగల సన్నాహక పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ,బీ,సీ,డీ వర్గీకరణతోనే అన్ని ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేపడతామన్న ప్రభుత్వం ఎనిమిదేళ్లయినా నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జ్యోతయ్య, ఎంఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, నారాయణ, వాసు, నర్సింహ, వెంకటయ్య, జగన్, మహేందర్, కృష్ణయ్య, యాదయ్య, శేఖర్, మల్లేశ్, గణేశ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కడ్తాల్: మండల పరిధిలోని గడ్డమీది తండా పంచాయతీలో రూ.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎంపీపీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. గ్రామాలు, తండాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాండు నాయక్, ఉప సర్పంచ్ రమణ, వార్డు సభ్యులు బన్సీలాల్, అమృ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన సూద ఆంజనేయులు శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆంజనేయులు మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.4 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఉప సర్పంచ్ రామకృష్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు మల్లేశ్‌గౌడ్, రాంచందర్ తదితరులు ఉన్నారు.

జన చైతన్య యాత్రను జయప్రదం చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యాదయ్య

మంచాల: మండల పరిధిలో ఈ నెల 28న నిర్వహించనున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగుడాల యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హన్మకొండలో ప్రారంభమైన ఈ యాత్ర 28న మండల పరిధిలోని ఆరుట్లకు చేరుకుంటుందన్నారు. ఆరుట్ల, జాపాల, రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాల మీదుగా యాచారం మండల కేంద్రానికి చేరుకుంటుందని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి శ్యాం సుందర్, జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జంగయ్య, మండల నాయకులు బుగ్గ రాములు, మమత, రాజు, స్వామి, గోపాల్, కృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

కౌన్సిలర్ విజయ్‌కృష్ణ

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్ విజయ్‌కృష్ణ కోరారు. పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో శనివారం ఆయుష్మాన్ భారత్ పథకంలో పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కృష్ణ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరడంతో ప్రతీ కుటుంబానికి రూ.5లక్షల ఉచిత బీమా సౌకర్యం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రాములు, ఎర్రవోలు మహేశ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన బండగల నర్సింహ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా కార్యదర్శి పాండుప్రసాద్ శనివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పిలుపు మేరకు పాండుప్రసాద్ మృతుడి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యంతో పాటు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు గతమేనా..!

పుస్తకం హస్తభూషనమన్నారు పెద్దలు. ఇంటర్నెట్ విస్తరించినా.. పుస్తక పఠనం తగ్గలేదు. ఒకప్పుడు గ్రంథాలయాల్లో కుర్చీలు దొరక్క ఇబ్బంది పడేవారు. కానీ నేడు లైబ్రరీలకు పుస్తకాలే అందడం లేదు. దీంతో క్రమంగా పాఠకులు తగ్గిపోతున్నారు.

లైబ్రరీలకు అందని పుస్తకాలు

- తగ్గుతున్న పాఠకులు



ఆరుట్ల గ్రంథాలయం

మంచాల: గ్రంథాలయాలు విజ్ఞాన బాండగారాలుగా పేరొందాయి. యువత సైతం పెద్ద ఎత్తున లైబ్రరీలకు వచ్చి పుస్తకాలు చదివే వారు. మరికొందరు రుసుం చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకుని ఇంటికి తీసుకెళ్లి చదివి తీసుకొచ్చేవారు. కానీ క్రమంగా గ్రంథాలయాలకు పుస్తకాలు అందడం తగ్గింది. దీనికి తోడు పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో నిర్వహణ ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కోవిడ్ తర్వాత తగ్గిన ఆదరణ

గతంలో మంచాల, ఆరుట్ల గ్రంథాలయాలకు పాఠకులు అధికంగా రావడంతో లోపల కుర్చీలు లేక కూర్చునేందుకు పోటీ పడేవారు. అదే స్థాయిలో పాఠ్య పుస్తకాలు, వార్త పత్రికలు, మాస పత్రికలు, ప్రత్యేక మ్యాగ్జిన్లు వచ్చేవి. పోస్టాఫీసు నుంచి పంచతంత్ర, సప్తగిరి, విస్‌డమ్, ప్రజా తంత్ర, గ్రంథాలయ సర్వస్వం వంటి విజ్ఞాన పుస్తకాలు వచ్చేవి. పోటీ పరీక్షలు ప్రిపేర్ అయ్యే వారు నిత్యం గ్రంథాలయాలను అంటి పెట్టుకుని ఉండేవారు. నేడు గ్రంథాలయాలకు ఆశించిన స్థాయిలో పుస్తకాలు రావడం లేదని పాఠకులు వాపోతున్నారు. పోస్టాఫీసు నుంచి పుస్తకాలు కూడా రావడం లేదంటున్నారు. కరోనా అనంతరం ఈ సమస్యలు పెరిగాయంటున్నారు. గతంలో మంచాల లైబ్రరీకి 60మంది వరకు వచ్చేవారు నేడు 30 మందిని మించడంలేదు. ఆరుట్లలో 70 నుంచి 80 మంది వచ్చేది ప్రస్తుతం 40నుంచి 50 మంది మాత్రమే వస్తున్నారు.

వందేళ్ల చరిత్ర

ఆరుట్లలో గ్రంథాలయం ఏర్పాటు చేసి వంద సంవత్సరాలు దాటింది. ఈ ప్రాంతంలో నైజాం వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఈ గ్రంథాలయ పాత్ర గొప్పదని చరిత్రకారులు చెబుతున్నారు. అప్పటి వామ పక్ష నాయకులు ఇక్కడి గ్రంథాలయానికి వచ్చి వార్త పత్రికలను చదివి సమాచారం తెలుసుకోవడమే గాకుండా అక్కడే సమావేశం ఏర్పాటు చేసి నైజాం విధానాలను ఎండగట్టేవారని చెబుతారు. ఇంతటి చరిత్ర కలిగిన ఆరుట్ల గ్రంథాలయానికి సరైన భవన సదుపాయం లేదు. గతంలో మాదిరిగా పుస్తకాలు సైతం అందడం లేదని పాఠకులు చెబుతున్నారు.

పూర్తి స్థాయి సిబ్బంది అవసరం



గ్రంథాలయాల పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయాలి. మంచాల, ఆరుట్లకు ఒక్కరే గ్రంథపాలకుడు ఉన్నాడు. ఆయన డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నాడు. పూర్తి స్థాయి సిబ్బంది ఏర్పాటు చేయాలి.

– కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్, ఆరుట్ల

చర్యలు తీసుకోవాలి



గ్రంథాలయాల్లో గతంలో మాదిరిగా విజ్ఞాన పుస్తకాలు, పోటీ పరీక్షలకు అవసరమయ్యే మ్యాగ్జిన్లు అందుబాటులో ఉంచాలి. అన్నిరకాల వార్త పత్రికలు ఇతర విజ్ఞాన పాఠ్య పుస్తకాలు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బాలరాజు, మంచాల

అభివృద్ధి చేస్తాం



గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేస్తాం. మంచాలలో రూ.33లక్షలతో గ్రంథాలయ భవనం నిర్మిస్తున్నాం. మరో రూ.10లక్షలతో అన్ని రకాల వసతులుకల్పిస్తాం. ఆరుట్లలో వందేళ్ల చరిత్ర ఉన్న గ్రంథాలయం ఉంది. ఆధునిక పద్ధతిలో నిర్మించేందుకు సరిపడా స్థలం లేదు.

– వెంకటరమణ రెడ్డి, చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ఆమనగల్లు: చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి అన్నారు. పట్టణంలోని కస్తూర్బాగాంధీ గిరిజన విద్యాలయంలో శనివారం పోషణ పక్షం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సక్కుబాయి మాట్లాడుతూ.. చిరుధాన్యాలు.. సిరిధాన్యాలు అన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే దీర్ఘకాలిక రోగాలను నయం చేసుకోవచ్చునని సూచించారు. ఊదలు, సామలు, కొర్రలు, అరికలు, రాగులు, జొన్నలు, సజ్జలు తదితర చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని వీటితో ఫైబర్, ప్రొటీన్స్, విటమిన్ బి అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శబరి, జయమ్మ, సరళ, పార్వతి, పద్మ, బాలమణి, తిరుమల, మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, రజిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



పోషక ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బ్రిడ్జి పనులను ప్రారంభించండి

వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి

ఆమనగల్లు: మండల పరిధిలోని మేడిగడ్డతండా నుంచి శంకరకొండతండా రోడ్డులోని వాగుపై బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలని వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరై ఏడాది గడిచినా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. శనివారం ఆయన మేడిగడ్డతండా, శంకరకొండతండాలకు చెందిన పలువురు యువకులతో మేడిగడ్డతండా సమీపంలోని కత్వ వాగును పరిశీలించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నిర్లక్ష్యానికి మేడిగడ్డ బ్రిడ్జి నిర్మాణమనే నిదర్శనమని విమర్శించారు. పనులు ప్రారంభించకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు నరేశ్‌గౌడ్, శ్రీనుగౌడ్, రాజు, విఠల్, మల్లేశ్, కుమార్, నరేశ్, సాయి, మధు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను గాలికొదిలేశాయి



జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి ధ్వజం

హయత్‌నగర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని.. వాటిని తిప్పికొడదామని పీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టి అన్నారంలో హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానికుల సమస్యలను గాలికొదిలేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్ల స్థలాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీలాంటి పథకాలను అమలు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల వ్యవసాయ రుణాల మాఫీ, వంట గ్యాస్‌ను రూ.500కే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లారెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను విడుదల చేయండి

ఇబ్రహీంపట్నం: అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్నను వెంటనే విడుదల చేయాలని పలువురు జర్నలిస్టులు శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ కేసులు బనాయిస్తూ మీడియా గొంతు నొక్కడం సరికాదన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ఇబ్రహీంపట్నం: స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్ శనివారం పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడిని జయించి ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి వీరేశ్, విజయ్‌కుమార్, వినోద్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులు ఎన్ఎస్ఎస్ క్యాంప్

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో శనివారం నగరంలోని సిటీ ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆరుట్ల, అస్మత్‌పూర్, చాంద్‌ఖాన్ గూడ, మంచాల గ్రామాల్లో వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ ర్యాలీలో ఆరుట్ల సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ఏర్పాటుకు విరాళం

రూ.10.50లక్షలు అందజేసిన వైస్ ఎంపీపీ ఆనంద్



ఆనంద్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: మండల కేంద్రంలో బొడ్రాయి ఏర్పాటుకు అవసరమైన రూ.10.50లక్షల విలువైన స్థలాన్ని వైస్ ఎంపీపీ బావండపల్లి ఆనంద్ కొనుగోలు చేసి విరాళం అందజేశారు. ఈ మేరకు శనివారం ఆయన్ను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహా రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన పనులకు నిరంతరం సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు చందోజీ, భిక్షపతి, అశోక్, కృష్ణ, జహంగీర్‌అలీ, సిద్దిగారి దాస్, చంద్రయ్య, వెంకటేశ్, నాగార్జున్, రాజేందర్, రాములు తదితరులు ఉన్నారు.

ప్రజాసేవ చేసేందుకే ఐక్యత ఫౌండేషన్

చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



కేక్ కట్‌చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రజాసేవే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి పరిధిలోని జమ్ములబావి తండాకు చెందిన నిరుపేద మహిళ బాయమ్మకు ఇచ్చిన హామీ మేరకు శనివారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం అభిమానుల మధ్య ఆయన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్మాస్‌పల్లి సర్పంచ్ శంకర్, స్థానికులు జగన్‌గౌడ్, రవీందర్‌గౌడ్, శేఖర్, రాములు, విజయ్, రవి, శ్రీకాంత్, వెంకటేశ్, ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, సభ్యులు శ్రీరాములు, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

తలకొండపల్లి: ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం గట్టుఇప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, పంచాయతీ కార్యాలయం వద్ద పండ్లు పంపిణీ చేశారు.

ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు



కడ్తాల్: ప్రధాని దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



తలకొండపల్లి: కాంగ్రెస్ నాయకుల ధర్నా



ఆమనగల్లు : ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాహుల్ గాంధీ అనర్హత వేటుపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

కడ్తాల్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో బ్లాక్‌డే అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ మండిపడ్డారు. ఇందుకు నిరసనగా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టి ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు శంకర్, పాండునాయక్, భారతమ్మ, విఠలయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు రాములుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్ నాయక్, నాయకులు హీరాసింగ్, మల్లేశ్‌గౌడ్, రాజేశ్, రాజేందర్, శ్రీను, మల్లయ్య, రామకృష్ణ, షాబుద్దీన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ప్రశ్నించినందుకే వేటు..

తలకొండపల్లి: దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అదాని గురించి ప్రశ్నించినందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై వేటు వేశారన్నారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. మార్చి 23 ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని ప్రభాకర్‌రెడ్డి అభివర్ణించారు. రాహుల్‌పై వేటుకు నిరసనగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్ రెడ్డి, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ అజీం, మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ కన్వీనర్ రవీందర్‌యాదవ్, విష్ణు, ఆరీఫ్, శివ, వెంకటేశ్, గౌస్, శ్రీను, ప్రవీణ్‌రెడ్డి, జంగయ్య, రఘుమారెడ్డి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

‘మోదీ దురహంకారానికి పరాకాష్ట’

ఆమనగల్లు: దేశంలో ప్రధాని మోదీ నియంత పాలన సాగిస్తున్నాడని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆరోపించారు. రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ.. శనివారం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. ఇది దురహంకారానికి పరాకాష్ట అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాములు, శ్రీనివాసులు, కృష్ణనాయక్, రాఘవేందర్, అలీం, రాజశేఖర్, ప్రసాద్, ఖాదర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కల్లోలం

- మాజీ ఎంపీపీ నిరంజన్‌రెడ్డి జోడో యాత్రకు హాజరుకావొద్దని పార్టీ శ్రేణులకు పిలుపు
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొంటే అడ్డుకుంటాం
- గ్రూపు రాజకీయాలతో మూడుసార్లు ఓటమి పాలయ్యాం

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనొద్దంటూ పలువురు పార్టీ నేతలు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జడల రవీందర్‌రెడ్డి, మస్కు నర్సింహ, కొత్త ప్రభాకర్‌గౌడ్, వింజమూరి రాంరెడ్డి, మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కొత్తకుర్మ మంగమ్మ, ఆకుల ఆనంద్‌కుమార్, పార్టీ నాయకులు మంఖాల దాసు, కొంద్రు ప్రవీణ్, కోడూరి రమేశ్, ఎదుల్ల పాండురంగారెడ్డి తదితరులు ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రూపులకు అతీతంగా నాయకులంతా మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో పనిచేస్తుంటే, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి కాంగ్రెస్‌లో కల్లోలం సృష్టిస్తున్నాడని ఆరోపించారు. పార్టీ మండల, మున్సిపల్ అధ్యక్షులకు సమాచారం ఇవ్వకుండా ఆయన పాల్కంపల్లిలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తుండడం సరికాదన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో నిర్వహించాల్సి జోడో యాత్ర కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆహ్వానించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎంపీ కోమటిరెడ్డి అంటే తమకు అభిమానం, గౌరవం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసే ద్రోహులను ప్రోత్సహించవద్దని.. పాల్కంపల్లి జరిగే కార్యక్రమానికి హాజరుకావొద్దని ఎంపీ ని కోరారు. కోమటిరెడ్డి వస్తే తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉన్నా.. గ్రూపు రాజకీయాలతో మూడుసార్లు ఓటమి పాలయ్యామని.. వచ్చే ఎన్నికల్లో గెలుపునకు కలిసట్టుగా పని చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. అధిష్టానం టికెట్ ఇచ్చేవారినే గెలిపించేందుకు కలిసి పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో ఏర్పుల రాజు, సత్తయ్య, భరత్‌రెడ్డి, సాయితేజ, ఎడమ నరేందర్‌రెడ్డి, ప్రేమాకర్‌రెడ్డి, ఏర్పుల సురేశ్, రవికుమార్, కాకి నాగార్జున, గణేశ్, జంగయ్య, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు